సాక్షి
వరంగల్
బుధవారం । 27 । నవంబర్ । 2024



కరాటే వీరులు..
ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకు కరాటే సాధన చేస్తున్నారు. కటా, కుమతి, కుంగ్-ఫూ తదితర అంశాల్లో హోరాహోరీగా పోటీపడుతున్నారు.
- 8లో▸



ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు
రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
27⁰ /16⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణ స్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా మారుతుంది. సాయంత్రం నుంచి పొగమంచు కురియడంతో రాత్రి చలితీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం



నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మహిళలు సోమవారం రాత్రి లక్షదీపోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు వేంశెట్టి శ్రీనివాస్, దుబ్బ రమేశ్, రామగోని సుధాకర్, భక్తులు దాసరి శిరీష, లక్ష్మి, పద్మ, స్రవంతి, సావిత్రమ్మ, సుకన్య, శారద, శ్రీవిద్య లక్ష దీపాలంకరణ శంఖ చక్రాలు, పట్టే వర్ధనలు పూలతో కార్తీక దీపాలు ప్రమిదలతో అలంకరించారు. అర్చకులు ముడుంబై రామానుజచార్యులు, శ్రీకర్ భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

అడిషనల్ కలెక్టర్ సేవలు అభినందనీయం




నల్లబెల్లి: చలి తీవ్రత నేపథ్యంలో మూడుచెక్కలపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి తన స్వంత డబ్బులతో దుప్పట్లు, మంకీ క్యాప్స్ అందించడం అభినందనీయమని నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి అన్నారు. అడిషనల్ కలెక్టర్ పంపించిన దుప్పట్లు, మంకీ క్యాప్స్‌ను పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీఓ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. విద్యార్థినులు అడిషనల్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవుల ను ఆర్డీఓ సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఐటీడీఏ ఏట పరశురాములు, డిప్యూటీ వార్డెన్ వీరమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్‌జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన సబ్‌జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహంగా కొనసాగాయి. అండర్-8, 10, 12 బాలబాలికల విభాగంలో 50, 100, 300, 400, 600 మీటర్ల రన్నింగ్ పోటీలతోపాటు కిడ్స్ జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ ఎంపికలకు వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఊర యుగేందర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్ 1 నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరగనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘం జనగామ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, అసోసియేషన్ ప్రతినిధులు బండి కృష్ణమూర్తి, మహేందర్, రజనీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టును పూర్తి చేయండి




హన్మకొండ చౌరస్తా: మామునూరు ఎయిర్‌పోర్టు పనులను త్వరిత గతిన పూర్తి చేసి విమాన రాకపోకలను ప్రారంభించాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజారపు రాంమ్మోహన్ నాయుడును వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు ఆమె.. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి రాంమ్మోహన్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రేటర్ వరంగల్ మాస్టర్‌ప్లాన్, ఓఆర్ఆర్, విమానాశ్రయ ఏర్పాటుకు 4వేల కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు కేంద్రమంత్రి వారికి తెలిపారు. దీంతో వారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రయ్.. రయ్ ఎప్పుడు?

నత్తనడకన వరంగల్ టు కరీంనగర్ ఎన్‌హెచ్563 పనులు..
- జూలై 2025 నాటికి పూర్తి గగనమే..
- రూ.2,146.86 కోట్లతో హైవే పనులు
- నగరం సమీపంలో వెరీ స్లో.. సబ్ కాంట్రాక్టర్లకు ఇవ్వడం వల్ల ఆలస్యం
- నెమ్మదిగా బైపాస్ రోడ్డు, డివైడర్లు, వంతెనల నిర్మాణాలు



ఎల్కతుర్తి మండలం పెంచికల పేట నుంచి హసన్‌పర్తి వరకు నత్తనడకన సాగుతున్న ఎన్‌హెచ్-563 ఫోర్‌లేన్ పనులు



సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్ నుంచి కరీంనగర్ ఇరుకైన రెండు వరుసల రహదారి గుంతలమయం కావడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ తర్వాత రెండు ముఖ్య నగరాలైన వరంగల్ – కరీంనగర్ మధ్య రద్దీ రాకపోకలు పెరగడంతో ఇప్పుడున్న రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. నాలుగేళ్ల కిందటే దీన్ని నాలుగు వరుసలుగా విస్తరించాలనుకున్నారు. నిధుల లేమితో ఆలస్యం కాగా.. భారత్‌మాలా పరియోజన్ కింద 2022లో రూ.2,146 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. సుమారు 68 కిలోమీటర్ల విస్తీర్ణం గల ఈ రోడ్డును 2025 జూలైలో పూర్తి చేయాలని 2023 ఫిబ్రవరిలో కాంట్రాక్టు సంస్థ అగ్రిమెంట్ చేసుకోగా.. విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులను అడిగితే సబ్ కాంట్రాక్టర్ల వ్యవస్థ కారణం వల్ల కొంత ఆలస్యమవుతుందని చెబుతుండగా.. ఇలాగైతే 2025 జూలై వరకు పూర్తవడం కష్టమేనన్న అభిప్రాయాలను వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు.

మరో ఎనిమిది నెలలే గడువు...
వరంగల్ – కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-563) విస్తరణ పనులు పూర్తి చేయడానికి ఎనిమిది మాసాలే గడువు ఉంది. ప్రధానంగా ఎల్కతుర్తి మండలం పెంచికలపేట నుంచి హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ మధ్యన ఆగుతూ.. సాగుతూ ముందుకెళ్తున్న పనుల్లో మరింత వేగం పెరగాల్సిన అవసరముంది. ఈ హైవే కోసం కోసం 305.47 హెక్టార్ల భూమి అవసరం రాగా, దాదాపుగా 258 హెక్టార్లను సేకరించడంతోపాటు 47.14 హెక్టార్ల ప్రభుత్వ ఆధీనంలోని భూమిని దారి విస్తరణకు ఉపయోగించుకుంటున్నారు. దాదాపు 30 గ్రామాల ప్రజలకు.. పలు జిల్లాల ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త వసతులతో ఉపయోగకరంగా ఉండనుంది. కరీంనగర్ జిల్లాలో 46.245 కి.మీ.ల మేర కొత్తదారి నిర్మితమవుతుండగా.. హనుమకొండ జిల్లాలో 21.770కి.మీ.లు ఉంది. ఇప్పటి వరకు కేవలం 51 శాతం పనులే జరిగాయి. పనులను విభజించి అక్కడక్కడ చేపడుతుండటంతో రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా పనులు పూర్తి కాకపోవడంతో పొలాల మధ్య నుంచి రోడ్డును వేస్తున్న ప్రాంతాల్లో రైతులకు అగచాట్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో వీలైనంత తొందరగా ఈ మార్గాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ పనుల్లో వేగం పెరగాలి..
- వరంగల్ – కరీంనగర్‌ల మధ్యన ఈ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలుచోట్ల మురుగు, వరదనీటి వ్యవస్థతోపాటు నడక మార్గాన్ని 53 కి.మీ.ల మేర ఏర్పాటు చేస్తున్నారు.
- కరీంనగర్ జిల్లా మానకొండూరు, తాడికల్, హుజూరాబాద్ బైపాస్‌లు సుమారు 31 కిలోమీటర్లు కాగా, హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి బైపాస్ 4.600 కి.మీ.లు, హసన్‌పర్తి బైపాస్ 9.575 కి.మీ.లు ఉంది.
- రహదారి విస్తరణలో భాగంగా సరిహద్దు గోడలతోపాటు చిన్నపాటి ప్రహరీలను 13.16 కి.మీ.ల దూరం ఏర్పాటు చేయాలి.
- ఒక ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఒక ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి) నిర్మాణం జరుగుతోంది.
- మొత్తంగా ఈ మార్గంలో 6 పెద్దవి, 20 చిన్న వంతెనలు నిర్మించాలి. సగం వరకు మాత్రమే అయ్యాయి.
- బాక్స్ బ్రిడ్జిలు 112 చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉండగా 83 వరకు పూర్తయ్యాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- డీఎంహెచ్ఓ సాంబశివరావు



ఆరోగ్య మహిళా కార్యక్రమంపై సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ సాంబశివరావు

ఖానాపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం లభిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన ఆరోగ్య మహిళ, ఇతర వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళలకు నిత్యం వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. బాలింతలకు వైద్య పరీక్షలు చేయాలని, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. మలేరియా, డెంగీ, టీబీ, లెప్రసీ, ఫైలేరియా వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓను సన్మానించారు. వైద్యులు అరుణ్‌కుమార్, జ్యోతి, రుచిత, కల్పన, సీహెచ్ఓ రాజరయ్య, అనిల్, దామోదర్‌రెడ్డి, దేవిక, చిన్ని, సబిత, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

చలికాలంలో జాగ్రత్తలు పాటించాలి
చెన్నారావుపేట: చలికాలంలో చిన్నపిల్లలు, పెద్దలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి, పేషంట్లతో మాట్లాడారు. సిబ్బందితో మాట్లాడుతూ.. సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలన్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేయాలని చెప్పారు. చలికాలంలో శ్వాసకోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్, చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. స్వెటర్స్, గ్లౌజెస్, దుప్పట్లు నిండుగా కప్పుకొని చలి నుంచి రక్షణ పొందాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీల సంఖ్య పెంచాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందించాలని, సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సరోజ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

సకాలంలో ‘ఉపాధి’ కూలి అందించాలి

- వర్ధన్నపేటలో కేంద్ర బృందం పర్యటన



పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

వర్ధన్నపేట: ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని కేంద్ర బృందం సభ్యులు అన్నారు. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడానికి సందీప్ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం వర్ధన్నపేట జెడ్పీఎస్ఎస్ పాఠశాలతోపాటు మండలంలోని కొత్తపల్లి, ఇల్లంద తదితర గ్రామాలను సందర్శించింది. అభివృద్ధి పనులపై బృందం ఆరా తీసింది. కొత్తపల్లి గ్రామంలో శ్మశానవాటిక, నర్సరీ, పామ్ ఫాండ్, పంచాయతీ కార్యాలయంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు తదితర అంశాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఉపాధి హామీ పనుల తీరును చూసి, కూలి నిర్దేశిత సమయంలో అందుతుందా.. అని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందం వెంట ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీఓ ధనలక్ష్మి,ఏపీఓ నాగేశ్వర్,పంచాయతీ కార్యదర్శులు రామారావు,మురళి కృష్ణ,రాజు ఈసీలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రెండు జెడ్పీల ఏర్పాటు

- హనుమకొండ పరిధిలో 12 మండలాలు.. వరంగల్ పరిధిలో 11 మండలాలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం

హన్మకొండ: ప్రభుత్వం ఎట్టకేలకు హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేసింది.ఈ మేరకు జీఓ ఎంఎస్ నంబర్ 68 విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకు వరంగల్ అర్బన్ జెడ్పీగా కొనసాగగా ఇకనుంచి హనుకొండ జిల్లా ప్రజాపరిషత్‌గా, వరంగల్ రూరల్ జెడ్పీ.. వరంగల్ జెడ్పీగా కొనసాగనుంది. రాష్ట్రంలో 2016లో ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేసింది. ఈ క్రమంలో పూర్వ వరంగల్ జిల్లాలోని మండలాలను ఆరు జిల్లాల్లో కలిపింది. 2019లో మరోసారి జిల్లాల పునర్విభజన జరుగగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ములుగు డివిజన్‌లోని మండలాలను కలుపుకుని ములుగు జిల్లాను ఏర్పాటు చేశారు. 2016లో వరంగల్ అర్బ, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేయగా జనగామ నియోజకవర్గంలోని మద్దూరు, చేర్యాల మండలాలను సిద్దిపేట జిల్లాలో కలిపారు. దీంతో పూర్వ వరంగల్ జిల్లాలోని మండలాలు ఏడు జిల్లాల్లోకి వెళ్లాయి.

2021లో రెండు జిల్లాల పేర్లు మార్పు
వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలుగా ఉండడం బాగా లేదని, దీనిపై అభ్యంతరాలు రావడంతో 2021 ఆగస్టు 12న వరంగల్ అర్బన్‌ను హనుమకొండ, వరంగల్ రూరల్‌ను వరంగల్ జిల్లాలుగా ఏర్పాటు చేసింది. వరంగల్ రూరల్ జిల్లా పరిధిలో ఉన్న పరకాల డివిజన్‌లోని 5 మండలాలు, వరంగల్ అర్బన్ జిల్లాలోని 9 మండలాలు కలిపి మొత్తం 14 మండలాలతో కలిపి హనుమకొండ రెవెన్యూ జిల్లాగా ఏర్పాటు చేశారు. వరంగల్ రూరల్ జిల్లాలోని మిగతా 13 మండలాలతో కలిపి వరంగల్ రెవెన్యూ జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటికే జిల్లా జెడ్పీలకు పాలక మండళ్లు కొనసాగుతున్నాయి. ఈ మేరకు హనుమకొండ నగర పరిధిలోని రెండు మండలాలు మినహాయించి 12 మండలాలతో హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్, వరంగల్ నగర పరిధిలోని రెండు మండలాలు మినహాయించి 11 మండలాలతో వరంగల్ ప్రజాపరిషత్‌లు ఏర్పాటు కావాల్సి ఉండగా ఇన్నాళ్లు జాప్యం జరిగింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో రెండు జిల్లా ప్రజాపరిషత్‌లపై స్పష్టత వచ్చింది.

హనుమకొండ జెడ్పీ పరిధిలో
- ఐనవోలు, హసన్‌పర్తి, వేలేరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్, పరకాల, నడికుడ, దామెర, ఆత్మకూరు, శాయంపేట.

వరంగల్ జెడ్పీ పరిధిలో
- సంగెం, గీసుకొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి, నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి

- కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి న్యూఢిల్లీ నుంచి రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతిరోజూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం ఎంత వస్తుంది.. ఎంత ధాన్యం రావాల్సి ఉందనే నివేదికలు అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రవాణా చేసే విధంగా లారీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చిన ధాన్యానికి త్వరగా ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. ధాన్యం అధిక మొత్తంలో కేంద్రానికి వచ్చినా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, సీపీఓ గోవిందరాజన్, డీఏఓ అనురాధ, డీఎస్ఓ కిష్టయ్య, డీఎం సంధ్యారాణి, డీఎంఓ సురేఖ, డీసీఓ నీరజ, ఆర్డీఓలు ఉమారాణి, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎంలు ట్యాంపరింగ్ కావు
ఎన్నికల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) ట్యాంపరింగ్ కావని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టి వేసిందని తెలిపారు. ఈ తీర్పు ఈవీఎంల విశ్వసనీయతకు మద్దతుగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందనడానికి రుజువుగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈవిషయంపై రాష్ట్ర ఎన్నికల అధికారి వివిధ ప్రచార మాధ్యమాలు, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసి ఈవీఎంల పైన అవగాహన కల్పించాలని సూచించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- నర్సంపేటలో ఇన్‌స్పైర్ కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

నర్సంపేట రూరల్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని రామవరం గ్రామ శివారులోని శివాని హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ×జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్ మనక్- రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని° కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సైన్స్‌ఫెయిర్‌తో విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు.. కలెక్టర్‌తో కలిసి వీక్షించారు. కలెక్టర్ సత్యశారద, డీఈఓ జ్ఞానేశ్వర్, సీఈఓ రాంరెడ్డి, సీపీఓ గోవింరాజన్, ఆర్డీఓ ఉమారాణి, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాలేజీయేట్ ఎడ్యూకేషన్ నోడల్ ఆఫీసర్ నవీన్, దుగ్గొండి తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, విద్యాశాఖ సెక్టోరిల్ అధికారులు ఫ్లోరెన్స్, సృజన్ తేజ, సుభాష్, ఎంఈఓ సారయ్య, సమ్మిరెడ్డి, రాహుల్ వర్మ, నాగార్జునరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇండోర్ పొల్యూషన్ రెడ్యూసింగ్ ప్రాజెక్టు



నెక్కొండ మండలం అప్పరావుపే జెడ్పీ పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, గైడ్ టీచర్ శ్రవణ్‌కుమార్, విద్యార్థి అఖిల్ రూపొందించిన ఇండోర్ పొల్యూషన్ రెడ్యూసింగ్ ప్రాజెక్టు ఆకట్టుకుంది. ఇంటిలో వాడే వివిధ రకాల పరికరాలు, ఉత్ప్రేరకాలతో గాలిలో కాలుష్యం పెరిగి అనారోగ్యం భారిన పడుతున్నామని వివరించారు. ఈసమస్యను పరిష్కరించేందుకు తక్కువ ఖర్చుతో గాలి నాణ్యతను మెరుగుపరిచడంతోపాటు ఇంటికి శోభను తెచ్చిపెట్టే ఇండోర్ ప్లాంట్స్ పెంచాలని సూచించారు.

స్కైలైన్ సిటీతో వైశాల్యం కనుక్కోవడం సులభం



చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థి సిద్ధార్థ.. గైడ్ టీచర్ కందికొండ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్కైలైన్ సిటీ ఎగ్జిబిట్ తయారు చేశాడు. విభిన్న 3డీ ఆకృతుల వైశాల్యాలు, ఘన పరిమాణాన్ని కనుక్కోవచ్చని సిద్ధార్థ వివరించాడు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

ఖిలా వరంగల్: ఈనెల 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట నాని గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన జరిగిన దీక్షా దివస్ కార్యక్రమ సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి సంబరాలు జరుపుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, టి.రమేష్‌బాబు, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, కార్యకర్తలు పాల్గొన్నారు

నకిలీ సర్టిఫికెట్ ఉద్యోగి ఔట్

- డీపీఎంను విధుల నుంచి తొలగించిన ఎన్‌హెచ్‌ఎం కమిషనర్
- నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

ఎంజీఎం: హనుమకొండ వైద్య, ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు డీపీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్ అనే ఉద్యోగి నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందాడని ఈ నెల 6న ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సదరు డీపీఎం రాష్ట్ర పరిధిలోని ఓ ఏజెన్సీ ద్వారా నియమితులయ్యాడు. హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, డీఎంహెచ్ఓ అప్పయ్య విచారణ చేపట్టి చర్యల నిమిత్తం కమిషనర్‌కు సిఫారసు చేశారు. దీనిపై స్పందించిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కమిషనర్ నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన శ్రీనివాస్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఆయన సొంత ఖాతాలోకి నిధులు మళ్లించిన డబ్బులపై ప్రత్యేక విచారణ చేపట్టాలని పేర్కొన్నారు.

సొంత ఖాతాలో నిధుల జమ..
నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందిన డీపీఎం శ్రీనివాస్ కొన్నేళ్లుగా ప్రభుత్వ సొమ్మును పెద్ద ఎత్తున దోచుకున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పల్లె దవాఖాన వైద్యుల శిక్షణ కోసం మంజూరైన రూ.5.32 లక్షలు, ఐఈసీ మెటీరియల్స్ కోసం మంజూరు చేసిన రూ.32 లక్షలను తన సొంత ఖాతాలోకి జమ చేసుకుని తప్పుడు లెక్కలు చూపించినట్లు తెలుస్తోంది. కమిషనర్ కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించి, అందినకాడికి దోచుకున్నట్లు సమాచారం. ఆరేడు సంవత్సరాలుగా నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం చేసిన శ్రీనివాస్ ఎన్ని ఆస్తులు కూడబెట్టాడో విజిలెన్స్ విచారణ చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. నామమాత్రపు చర్యల్లో భాగంగా విధుల నుంచి తొలగించకుండా ఎంత అవినీతి చేశాడో తేల్చి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరువురిపై పీడీ యాక్ట్

నెక్కొండ/గీసుకొండ: ఇరువురు నాటు సారా నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు నర్సంపేట, పరకాల ఎక్సైజ్ సీఐలు నరేశ్‌రెడ్డి, తాతాజీ తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం .. నర్సంపేట ఎక్సైజ్ పరిధిలోని నెక్కొండ మండలం చెరువుముందరి తండాకు చెందిన బానోతు సరియా, పరకాల ఎక్సైజ్ పరిధిలోని గీసుకొండ మండలం మొగిలిచర్లకు చెందిన ధరావత్ ధన్‌సింగ్.. నాటు సారా తయారీ, రవాణాతోపాటు, విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడ్డారు. ప్రవర్తన మారకపోవడంతో జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణ్‌కుమార్, కలెక్టర్ సత్యశారదకు నివేదిక సమర్పించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

16 మంది ప్యాసింజర్ గార్డుల తరలింపు

- ఆందోళనలో కాజీపేట రైల్వే గార్డులు
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని విజ్ఞప్తి

కాజీపేట రూరల్: కాజీపేట నుంచి 16 మంది రైల్వే ప్యాసింజర్ గార్డులను అధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు రైల్వే గార్డులు, రైల్వే నాయకులు మాట్లాడుతూ సికింద్రాబాద్ తర్వాత అతిప్రధాన కాజీపేట జంక్షన్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఇటీవల రైల్వే లింక్‌లను ఇతర రైల్వే డిపోలకు తరలించారన్నారు. ప్రస్తుతం కొత్తగా కాజీపేట కేంద్రంగా పని చేస్తున్న 16 మందిని వేరే రైల్వే డిపోలకు తరలించి ఈ డిపోకు ప్రాధాన్యం తగ్గించేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. కాజీపేట డిపోలో 2024లో 17 రైల్వే గార్డుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు గుర్తించారన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ట్రైనింగ్ పూర్తయిన 18 మంది కాజీపేట రైల్వే గార్డుల్లో16 మందిని సోమవారం వేరే డిపోలకు తరలించారని తెలిపారు. కాజీపేట నుంచి ఇతర రైల్వే డిపోలకు గార్డుల తరలింపు వల్ల రైల్వేశాఖకు లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని, అదే 16 మంది రైల్వే గార్డులకు ఇక్కడే పోస్టింగ్ ఇస్తే రూ.16 లక్షలు ఆదా అవుతాయన్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు ఆలోచించి తరలించిన గార్డులను తిరిగి కాజీపేటకు తీసుకొచ్చి రైల్వేకు ఆదాయం మిగిలేలా చూడాలని నాయకులు పేర్కొంటున్నారు.

రైల్వే వ్యాగన్, కోచ్‌ఫ్యాక్టరీ, కాజీపేట డివిజన్..

కాజీపేట రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణమవుతుండగా మరో వైపు కాజీపేట రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదిలా ఉండగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్న క్రమంలో కొంత మంది రైల్వే అధికారులు కావాలని గతంలో క్రూ లింక్‌ల తరలింపు చేయగా, ఇప్పుడు గార్డుల తరలింపు చేసి కాజీపేట లో కోపైలెట్ కార్యాలయాన్ని నిర్వీర్యం చేసే కుట్రచేస్తున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు పట్టించుకుని రైల్వే జీఎంతో మాట్లాడాలని రైల్వే గార్డులు, నాయకులు కోరుతున్నారు.

ధిక్కరణ కేసులో తహసీల్దార్‌ను మందలించిన కోర్టు

వరంగల్ లీగల్ : కోర్టు ఆదేశాలను ఎనిమిది నెలలుగా అమలు చేయకుండా ధిక్కరించిన హసన్‌పర్తి తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉపేందర్‌రావు మంగళవారం తీవ్రంగా మందలించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన ఏరుకొండ సుజాత వంశపారంపర్యంగా ఉమ్మడి కుటుంబ ఆస్తిలో తన భాగం ఇవ్వాలని కోర్టులో దావా వేసింది. దీనిపై విచారణ చేసిన కోర్టు 2024 ఏప్రిల్‌లో అప్పటి జడ్జి శ్రీనివాసులు తీర్పు వెల్లడించారు. పిటిషన్‌దారు ఏరుకొండ సుజాతకు తన ఇరువురి సోదరులతో పాటు మూడో భాగం వాటాను పంపకం చేసి రిజిస్ట్రేషన్, పట్టా పాస్ బుక్‌లు జారీ చేయాలని హసన్‌పర్తి తహసీల్దార్‌ను ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు. అయితే ఎనిమిది నెలలుగా ఈ తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేసిన తహసీల్దార్‌ను గతంలో తన ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. అయినా హాజరుకాకపోవడంతో మంగళవారం తహసీల్దార్ సీహెచ్. ప్రసాద్‌ను జడ్జి ఉపేందర్‌రావు మూడు రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. విషయం తెలిసిన జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది తహసీల్దార్‌తో సహా హాజరై లిఖిత పూర్వకంగా క్షమాపణ కోరిన అనంతరం తీర్పులో భాగంగా పిటిషన్‌దారు ఏరుకొండ సుజాత వాటాను రిజిస్ట్రేషన్ చేసి వెంటనే పట్టా పాస్ బుక్‌లు జారీ చేశారు. ఉదయం నుంచి కోర్టు ప్రాంగణంలో ఈ విషయంపై ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ దినోత్సవం రోజున మహిళలకు తమ వాటా తమకు దక్కేలా తీర్పు అమలు కావడంతో పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కరాటే వీరులు..

ఎవరు కొడితే.. మైండ్ బ్లాక్ అయిపోతుందో.. వారే కరాటే వీరులు.. మార్షల్ ఆర్ట్స్‌కు హనుమకొండ జిల్లా కేరాఫ్‌గా మారుతోంది. ముఖ్యంగా బాలబాలికలు, మహిళల్లో కరాటే ఆత్మవిశ్వాసం నింపుతోంది. తమపై దాడి చేయాలని చూసే వారి భరతం పట్టేలా తయారవుతున్నారు. అంతేకాదు ఈ పోటీల్లో పతకాలు సాధిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ జిల్లా పేరును నిలబెడుతూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.



కాజీపేటలో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలు
- జిల్లాలో సాధన చేస్తున్న చిన్నారులు
- జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సొంతం
- శిక్షకులుగా రాణిస్తున్న యువత

కాజీపేట: జిల్లాలో ఐదేళ్ల బాలల నుంచి మహిళల వరకూ కరాటే సాధన చేస్తున్నారు. ఒకనాడు పదుల సంఖ్యలో ఉన్న సాధకులు నేడు వందల సంఖ్యలోకి చేరారు. ఫలితంగా జాతీయస్థాయి కరాటే పోటీలకు జిల్లా కేంద్ర బిందువుగా మారింది. కాజీపేట పట్టణంలో రెండుసార్లు జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన అనేక మంది సాధకులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని ఓడించి పలు పతకాలు సొంతం చేసుకున్నారు. నగరంలోని అనేక క్రీడా మైదానాలతోపాటు కాజీపేట మండలంలోని పలు గ్రామాల్లో శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. కటా, కుమతి, కుంగ్‌-ఫూ తదితర అంశాల్లో బాలబాలికలు హోరాహోరీగా పోటీపడుతున్నారు. పదుల సంఖ్యలో కరాటే శిక్షకులు శిక్షణ అందిస్తున్నారు. కుంగ్‌ఫూ, జపాన్ షాటోఖాన్ కరాటే, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్లు పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో ఆసక్తి పెంచుతున్నాయి. ప్రభుత్వ ఆదేశం మేరకు మూడు నెలల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికలకు వారంలో మూడు రోజులు శిక్షణ ఇస్తుండడం విశేషం. వారు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. ఆత్మ రక్షణకు అవసరమైన రీతిలో శిక్షణ పొందుతున్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



కరాటే అంటే మాకు చాలా ఇష్టం. కుంగ్‌ఫూ మాస్టర్ పర్యవేక్షణలోనే తగిన శిక్షణ తీసుకుంటున్నాం. సెలవు రోజుల్లో ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున సాధన చేస్తున్నాం. మాలో ఎక్కడా లేని ఆత్మవిశ్వాసం పెరిగింది. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొంటామనే ధైర్యం ఏర్పడింది. గ్రీన్, ఎల్లో బెల్ట్‌లు సాధించాం.

– కొలిపాక సాత్విక, కల్యాణి, మడికొండ

అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమే..



అందరికీ మార్షల్ ఆర్ట్స్ అవసరమేనని గుర్తించాలి. ఎటువంటి విపత్కర పరిస్థితులైనా సునాయాసంగా ఎదుర్కొనే మొండి ధైర్యం దీని శిక్షణతో కలుగుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆటపాటలతో పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాలి. దాని వల్ల మానసికంగా, శారీరక సమస్యలు తట్టుకోవడానికి అలవాటు పడతారు.

– డి.కంఠేశ్, గ్రాండ్ మాస్టర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : మహోన్నత రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సంవిదాన్ దివస్ రాజ్యాంగ దినోత్సవ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ అభివృద్ధి రాజ్యాంగం వినియోగంపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రధానవక్త కేయూ లా కాలేజీ రిటైర్డ్ ప్రొఫెసర్ టి. విజయచంద్ర 'భారత రాజ్యాంగం డెమొక్రటిక్ గవర్నెన్స్' అనే అంశంపై మాట్లాడుతూ సామాజిక ప్రజాస్వామ్యం తోనే రాజకీయ ప్రజాస్వామ్యం సాధ్యమన్నారు.మన స్వేచ్ఛను సరెండర్ చేయొద్దన్నారు. సభలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ బి. రమ, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి. రాంచంద్రం, కేయూఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, యూనివర్సిటీ మొదటిగేట్ నుంచి విద్యార్థుల పాదయాత్రను వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. దూరవిద్యకేంద్రం ప్రాంగణంలోఅంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.రిజిస్ట్రార్ మల్లారెడ్డి బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రమాణం చేయించారు.

భారత రాజ్యాంగం గొప్పది

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: భారత రాజ్యాంగం గొప్పదని ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో సీఎండీ వరుణ్‌రెడ్డి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం దేశంలోని పౌరులకు హక్కులు కల్పించిందన్నారు. రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పొందుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి.వి.ఓ బి.జనార్దన్, సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, కె.ఎస్.గుట్ట, బీకం సింగ్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షల కోసం వెళ్తే ఇల్లు గుల్ల..

- తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు
- 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణ



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై భీమారెడ్డి

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్య కారణాలతో వైద్య పరీక్షల నిమిత్తం ఓ కుటుంబం హైదరాబాద్ వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఆ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం కాలనీలో నివాసం ఉండే మాజీ వార్డు సభ్యురాలు జెన్నాయికోడె శోభ, వేణుగోపాల్ దంపతులు వైద్య పరీక్షల నిమిత్తం సోమవారం ఇంటికి తాళంవేసి హైదరాబాద్ వెళ్లారు. ఆస్పత్రిలో ఆలస్యం కావడంతో రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం తమ ఇంట్లో పనిచేసే మహిళ వచ్చి చూడగా తలుపులు తీసి కనిపించాయి. దీంతో ఆమె ఆందోళన చెంది పక్కింటివారికి చెప్పగా వారు వెంటనే శోభ, వేణుగోపాల్ దంపతులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన వచ్చి పరిశీలించగా ఇంటి ప్రధాన ద్వారానికి ఉన్న సెంట్రల్ లాక్ తొలగించి ఉంది. ఇంట్లోని రెండు బీరువాల్లో భద్రపరిచిన 4 కిలోల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.60 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై భీమారెడ్డి, క్లూస్ టీం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కుమారుడికి సద్ది ఇవ్వడానికి వెళ్లి..

- బావిలో పడి గొర్రెల కాపరి మృతి

దుగ్గొండి: గొర్రెల మంద వద్ద ఉన్న తన కుమారుడికి భోజనం అందించడానికి వెళ్లిన ఓ గొర్రెల కాపరి బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కోట మల్లయ్య(60) సోమవారం రాత్రి మంద వద్ద ఉన్న తనకుమారుడికి భోజనం టిఫిన్ పట్టుకుని వెళ్తున్నాడు. అయితే మందకు కొంత దూరంలో వ్యవసాయ బావి వద్ద కాలుజారి అందులో పడ్డాడు. దూరం నుంచి గమనించిన కుమారుడు తోటి గొర్రె కాపరులతో కలిసి బావిలోకి దిగి మల్లయ్యను బయటకు తీశారు. అనంతరం దుగ్గొండి ఆసుపత్రికి తరలించారు. గాయాలపాలైన మల్లయ్య మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారులు నవీన్, రాజుకుమార్ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.



మల్లయ్య(ఫైల్)

కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో జాతీయ సదస్సు నిర్వహించబోతున్నట్లు ఆ విభాగం అధిపతి, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. 'గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ ప్రాసెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే అంశంపై ఈ జాతీయ సదస్సు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు.

ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు

- రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటికీ అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం గణపురం మండలకేంద్రంలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజక వర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. రాజ్యాంగం ఏర్పడి నేటికి 75 సంవత్సరాలు కావడం.. ఈ రోజే ప్రజాపాలన విజయోత్సవ సభ నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ సర్కారు పని చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తమ సర్కారు సంవత్సరకాలంలోనే 53 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల కాలంలో రైతులకు రుణ మాఫీ చేయలేదని, తమ ప్రభుత్వం ఒకేసారి రూ. 18వేల కోట్ల రుణ మాఫీని ఏక కాలంలో చేసిందన్నారు. కాగా, గణపురం నుంచి గుర్రంపేట వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారని, ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కృషితో రూ. 15 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుతో పాటు మోరంచ వాగు పై హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ తాము ప్రజా సేవకులమని, ప్రజల కష్టాలు, సమస్యలు తీర్చడం కోసం 18 గంటల పాటు పని చేస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు తమ స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు 170 ఎకరాలు అప్పగించగా తాను భూమిని వెనక్కి తీసుకుని ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు గాంధీనగర్ గుట్ట మీద 60 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌ను, 40 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దొంగల ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

- సాంకేతికతను వినియోగిస్తున్న పోలీసులు



బాధితుడితో మాట్లాడుతున్న సీఐ సుధాకర్ రెడ్డి

కాజీపేట : కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఈ నెల 23వ తేదీన దావ కిశోర్ అనే వ్యక్తి ఇంట్లో జరిగిన చోరీ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. భార్య ఆస్పత్రికి.. తాను పిల్లల కోసం ట్యూషన్ వద్దకు వెళ్లి వచ్చే సరికి దొంగలు చొరబడి ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు దాదాపు 35 తులాల బంగారం చోరీకి గురైనట్లు చెబుతుండగా బాధితుడు మాత్రం ఎక్కువే జరిగిందని తెలుపుతున్నాడు. దొంగలు ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనం వినియోగించినట్లు సీసీ కెమెరాల్లో కనిపించడంతో దొంగలు స్థానికుల లేక ఇతర రాష్ట్రాలకు చెందిన వారా అనే అంశం అర్థం కావడం లేదు. కిశోర్‌కు తెలిసిన వాళ్లు ఎవరైనా చోరీకి పాల్పడి.. కేసును పక్కదారి పట్టించడం కోసం ఢిల్లీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని వినియోగించి ఉంటారా అనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇంట్లో బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో సరిపోల్చుతున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ దొంగలను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశం మేరకు కేసు ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితోపాటు లోకల్ సీఐ, ఎస్సైలు ప్రత్యేక టీమ్‌లుగా ఏర్పడి దొంగలను పట్టుకోవడానికి అడుగులు వేస్తున్నారు.

ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వలేదంటూ..

- మాజీ ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



మాజీ జెడ్పీటీసీ సారయ్య ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భాస్కర్ దంపతులు

వరంగల్ : వరంగల్ ఏనుమాముల 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య డబ్బులు ఇవ్వడం లేదంటూ సుందరయ్యనగర్‌కు చెందిన గంధ్రతి భాస్కర్ దంపతులు మంగళవారం ఆత్మహత్య చేసుకుంటామంటూ పెట్రోల్ బాటిల్‌తో సారయ్య ఇంటి ఎదుట బైఠాయించారు. ఏనుమాములలో సుమారు 600 గజాల భూమిని సారయ్య, భాస్కర్, రాజు కొనుగోలు చేశారు. ఈ భూమిలో మరో వ్యక్తి గృహ నిర్మాణం చేస్తుండగా అడ్డుకోవడంతో మూడేళ్ల క్రితం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఆ భూమికి చెల్లించిన డబ్బులు ఇస్తే కేసు విరమించుకుంటామని భాస్కర్, రాజు పోలీసులకు చెప్పడంతో సారయ్య ఇరువురికి డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. అయితే డబ్బులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడిచినా చెల్లించకపోవడంతో విసిగివేసారిన భాస్కర్ దంపతులు ఆందోళనకు దిగినట్లు స్థానికులు తెలిపారు. పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆందోళనను విరమింపజేసి భాస్కర్ దంపతులను పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పెద్ద మనుషులు ఇరువర్గాలతో చర్చించారు. వచ్చే నెల 10వ తేదీన సారయ్య డబ్బులు ఇవ్వాలని, ఆ డబ్బులు అతడు ఇవ్వకుంటే తాను ఇస్తానని డివిజన్‌కు చెందిన అధికార పార్టీ నాయకుడు హామీ ఇవ్వడంతో కథ సుఖాంతం అయ్యింది. ఈ విషయంపై కార్పొరేటర్ భర్త, మాజీ జెడ్పీటీసీ సారయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. తాను భాస్కర్‌కు ఎలాంటి డబ్బులు బాకీ లేనన్నారు. స్థలం కొనాలని భాస్కర్ ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేస్తే 10వ తేదీలోగా డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

రైతు సదస్సులో వరంగల్ మార్కెట్ స్టాల్



చపాట రకం మిర్చి



కలాసీ రకం..



వండర్‌హాట్ రకం..

వరంగల్: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రైతు సదస్సులో ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి స్టాల్ ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల మంగళవారం తెలిపారు. 28వ తేదీన సదస్సును మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తున్నారని, 30వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈసదస్సులో ఏర్పాటు చేసిన స్టాల్‌లో చపాటా, కలాసీ (ఎల్లోకలర్ మిర్చి), వండర్‌హాట్ రకాల మిర్చి శాంపిల్స్‌ను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- వెంకటాపురంలో ఘటన

దుగ్గొండి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హింగే శోభన్‌బాబు(48)కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఎన్నిసార్లు సాగు చేసిన నష్టమే తప్పా లాభం రాలేదు. ఈ క్రమంలో వ్యయసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, ఇద్దరు ఆడపిల్లల పెళ్లిళ్లు ఇలా మొత్తం రూ. 10లక్షల వరకు అప్పు అయ్యింది. అయితే అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మిరపతోట వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్ద కూతురు రవళికి ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో భార్య హింగే ఉమ కొంతమంది రైతులతో కలిసి బావివద్దకు వెళ్లగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే నర్సంపేటకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.



శోభన్‌బాబు(ఫైల్)